కథ

# పిసినారి బావ - పండగ చందా

**"నీలాంటి ఖర్చుదారీ మనిషుంటే కొండలైనా కరిగిపోతాయే!" రుసరుస లాడుకుంటూ వస్తున్న లక్ష్మీపతి బావను చూస్తూ "ఎవరు అక్కేనా? కొంపదీసి ఓ చెంచాడు నూనెగాని ఎక్కువ ఖర్చు పెట్టేసిందేమిటి బావా?" అన్నాను నేను నవ్వుతూ.**

**"పోరా! నువ్వు మరీ విడ్డూరాలు పోతావు గానీ నేనేం అంత పిసినారి నట్రా?" అంటూ వీపుమీద చరిచాడు బావ.**

అది సరసంగా చరిచినట్లు లేదు. నా శ్లేషకు మండి కసిగా బాదినట్లే వుంది. మండుతున్న వీపును తడుముకుంటూ ''కావనుకో, మరి పండగ పూటా ఈ కారాలు నూరడమెందుకో'' అన్నాను.

''అదేరా! మీ అక్క.. ఈరోజు పండగ కదా, ఏం చేయను అని అడిగింది రా!''

''ఏం పండగ! వట్టి దండగ అని ఉంటారు మీరు'' అన్నాను నేను ఆయన చేతికందనంత దూరంగా జరుగుతూ.

''అన్నాౖనా.. ఇప్పుడు పండగని చెప్పేసేసి ఏ పిండివంటలో చేస్తే అదో ఖర్చు. ఇల్లు గుల్ల. ఆపైన అవన్నీ మింగితే ఆరోగ్యం చెడుతుంది. ఒళ్లు గుల్ల అన్నాను. ఏం తప్పా?'' కస్సున అరిచాడాయన.

''అబ్బే! ఆ రోగమే మహా భాగ్యం'' అన్నాను నేను మంటగా. ''ఏమిటీ'' అంటూ బావ గుర్రుగా చూసేసరికి లేని నవ్వును కొని తెచ్చుకుంటూ ''హి..హి..హి..ఆరోగ్యం. ఆ..రో..గ్య..మే మహాభాగ్యం. తింటే...ఛీ! అజీర్తి'' అన్నాను.

''అదీ! భేషైన మాటన్నావు. మీ అక్కకు నీపాటి బుద్ధి లేకపోయె. మూతి ముడుచుకొని 'ఇంతకూ కూరైనా చేయాలా వద్దా!' అని అడిగిందిరా. వట్టి రోజుల్లో అంటే ఎలాగోలా సరిపెట్టుకుంటామనుకో. కానీ పండగ పూటా కూర కూడా వద్దంటానికి నేనేం అంత పిసినారినట్రా?''

''హెబ్బే! కావు.. కావు'' తల అడ్డంగా ఊపుతూ కాకిలా అరచిన నన్ను తినేసేట్టు ఒక్క క్షణం చూసి, మళ్ళీ చెప్పాడిలా- ''సరే ఏదో ఒహటి తగలెట్టు'' అన్నారా. 'అరటికాయ ఆవపెట్టి వండనా' అందిరా మీ అక్క''.

''వద్దే. కాకరకాయల పులుసు పెట్టు. కలుపుకుందుకూ, నంజుడుకూ సరిపోతుంది. ఆపైన ఆరోగ్యానికి ఆరోగ్యమూనూ అన్నాన్రా''

''తగలెట్టడానికి ఏ కాయైతే ఏం బావా! అందులోనూ మన పెరట్లోని కాయలేగా!'' వ్యంగ్యంగా అన్నాను నేను. చెప్పద్దూ నాకు వళ్ళు మండిపోతూంది ఓ ప్రక్క.

''అదెలారా! గెలలోంచి నాలుగు కాయలు తుంచేస్తే గెల రేటు పడిపోదూ!'' అన్నాడు బావ.

''అంటే అరటి గెల అమ్మేస్తావా?''

''అమ్మక, మెక్కేస్తామేట్రా! అమ్మితే నాల్గు రాళ్ళొస్తాయిగానీ, తింటే ఏమొస్తుందిరా?''

''పోనీ ఆ రాళ్ళకో, రప్పలకో కాకరకాయలు అమ్మచ్చు కదా బావా!'' అసహనంగా అడిగాను నేను.

''బాగుందిరా! అరటి కాయలంటే మన పెరట్లోవి. మనిష్టం. పాపం. పక్కింటివాళ్ళ కాకరకాయల్ని మనం ఎలా అమ్మేస్తాంరా!''

అంతే! ఎలక్ట్రిక్ షాక్ కొట్టినట్లు కొయ్యబారిపోయాను నేను.

''మన పెరట్లో కాకరకాయలు ఎక్కడివిరా పిచ్చికన్నా! అయినా పులుసు పెట్టుకుంటాం అని అడిగితే పక్కింటివాళ్ళు రెండు పుంజీల కాయలు పెట్టరా ఏంటీ?'' చిద్విలాసంగా నవ్వుతూ చెప్పేసి, నిట్రాటలా నిలబడ్డ నా వెన్నును మరోమారు చరిచేసి, చక్కాపోయాడు మా బావ.

''అదీ! మా బావ కేరక్టరు. తన యింటిలోని కాయల్ని ఎంచక్కా అమ్మేసుకొని, పక్కింటి వాళ్ళని ముష్టి అడిగి ఆ కాయలతో కూర చేయమనే వీరముష్టి పిసినారి. ఆయనేం చందా యిస్తాడ్రా!''

అంతవరకూ నేను చెప్పింది విన్న నా స్నేహితులు తెల్ల మొహాలు వేసారు.

కనుమ సంక్రాంతి నాడే మా గ్రామ దేవత పండగ. ఈసారి భారీగా చేయాలని మా కుర్రకారు నడుం బిగించాం. చందాలు అడుగుతున్నాం. మా లక్ష్మీపతి బావనూ చందా అడుగుదామని వాళ్ళు.. వద్దని నేనూ. అదిగో ఆ ఔనూ, కాదులాటల్లో మా బావ కథ వినిపించాను వారికి.

''ఎంత పీనాసి అయినా పండగ. అందులోనూ అమ్మవారి పండగ చందా అంటే కాదంటాడా?'' పాయింట్ లేవదీసాడు శేషు అనే నా మిత్ర రత్నం. మాసిన తన గడ్డాన్ని బర, బరా బరుక్కుంటూ .

ఆ పట్నాన వాడి గడ్డాన్ని పట్టి పీకేద్దామన్నంత కోపం వచ్చింది నాకు. ''ఆ అమ్మోరే వచ్చి అడిగినా యివ్వడ్రా'' అన్నాను అసహనంగా.

''ట్రై అండ్ ట్రై అన్నారు బ్రదర్. అడుగుదాం మనదేం పోయింది'' అంటూ ప్రక్కనున్న వాడి చేతిలోని చందా డబ్బాను టక్కున లాక్కొని ''కొండకు తాడు కట్టి లాగుదాం. వస్తే చందా. తెగితే ఆఫ్ట్రాల్ తాడు. దట్సాల్!'' అన్నాడు శేషు.

''ఆ తెగేది నా మొలతాడురా'' కచ్చగా అరిచాను. ఫక్కున నవ్వారు ఫ్రెండ్సంతా.

''ఒరేయ్! చెప్తే వినరేంరా!

కర్ణాటక వాళ్ళు ఆల్మట్టిని కొట్టేసి మనకు కృష్ణా నీళ్ళు యివ్వచ్చుగాక! మన రాష్ట్ర ప్రభుత్వం కరెంటు కోత ఎత్తేసి మనకు ఇరవై నాలుగ్గంటలూ విద్యుత్ యిస్తే యివ్వచ్చుగాక! ఆఖరికి పాకిస్తాన్ రాజీకొచ్చేసి మనకు ఆక్రమిత కాశ్మీర్‌ను కూడా యిచ్చేస్తే యివ్వచ్చుగాక, కానీ.. బావ మాత్రం చచ్చినా ఒక్క పైసా కూడా చందా యివ్వడ్రా!''

అరచి, ఆయాసంతో వగరుస్తున్న నా భుజంపై తడుతూ ''ఆర్యూ ఆల్ రైట్'' అని అడిగాడు శేషు.

అర్థం కానట్లు నేను బ్లాంక్‌గా చూసాను. మిగిలిన వాళ్ళూ నా వంక అలానే చూస్తున్నారు. పిచ్చాడిని చూసినట్లు.

''అహ! ఏం లేదు బ్రదర్! రాయబారం సీన్లోని పద్యం లెవెల్లో కొటేషన్ కొడితేనూ!'' అని గలగలా నవ్వి-

''డోంట్‌గెట్ ఎగ్జయిటెడ్ బ్రదర్! కూల్ డౌన్'' అన్నాడు శేషు.

ఈలోగా మేం మాటల్లో నడుస్తూ గమనించలేదు గానీ, మా బావ యింటి దగ్గరకే చేరుకున్నాం. అది గమనించినవాడు శేషు. ''ఎలాగూ



**సుంకరి రామప్రసాద్**

యింటి దగ్గర వరకూ వచ్చాంగా 'ఓ రాయి విసిరి చూద్దాం'' అన్నాడు. మిగతా వారు తలలాడించారు.

''మీకేం ఓ రాయి విసిరేసి ఎంచక్కా పోతారు. ఆ తర్వాత మిమ్మల్ని చందాకు తీసుకువచ్చింది నేనేనని మా బావకు తెలిస్తే బొప్పికట్టేది నా బుర్ర'' అన్నాను అక్కసుగా.

''పోరా! నువ్వు మరీ ఎక్స్‌ట్రాలు పోతావు'' అంటూ చిలిపిగా నా డొక్కలో పొడిచాడు శేషు. ఘొల్లున నవ్వారంతా.

''మీకేంరా! ఈరోజు చందా డబ్బా ఘల్లు మనిపించేసి చక్కాపోతారు మీరు. రేపొద్దున్న రాకా, పోకా చేయాల్సినవాడిని నేను. ఏ పొద్దు ఏ క్లాసు పీకుతాడోనని రోజూ నేను చావాలి'' అన్నాను నేను దీనంగా.

కాసేపు తర్జన, భర్జనల తర్వాత ఎలాగైతేనేం నన్ను బలవంతంగా ఒప్పించారు. కాకుంటే, నేను ముందుగా యింట్లోకి వెళ్ళేట్టు. ఓ పావుగంట ఆగి, నాతో సంబంధం లేనట్టు, వాళ్ళు విడిగా వచ్చి బావను కలిసేట్టు.

భయపడుతూనే లోనికి వెళ్ళాను. చావిట్లో వాలు కుర్చీలో హాయిగా చేరబడి ఉన్నాడు లక్ష్మీపతి బావ. దగ్గరకు నడిచాను. నిద్రలో ఉన్నట్లుంది.

''కోటి.. కోటి..కోటి..'' అంటూ కలవరిస్తున్నాడు.

ఏదో ఆనందంతో ముఖం మతాబులా వెలిగిపోతోంది. ''బావా'' అంటూ పిలిచాను. ఊహూ! మన లోకంలో లేడు. మూడోసారి గట్టిగా పిలిచేసరికి ఉలిక్కిపడి లేచాడు.

''ఏంటి బావా! పట్టపగలు కలవరిస్తున్నావు. కలగన్నావా?''

''కలవరించానా? అంటే ఆ కోటీ వట్టి కలే! పగటి కలే! చ్చొ.. చ్చొ.. చ్చొ.. ఏం కల!?'' అని కాసేపు నొచ్చుకొని, మళ్ళీ కలను గుర్తు తెచ్చుకుని మహదానందపడిపోతూ ''ఒరేయ్! కల అంటే ఆహా! మహ పసందయిన కలలే!'' అన్నాడు బావ.

''ఆ! నీకు యింకేం కలలొస్తాయిలే! నీ కొడుకు మెడకు కన్నె తగిలించి సంతకు తోలుకెళ్ళి అమ్మేసినట్లో, లేకుంటే త్రాసులో కేజీల్లెక్కన తూచేసి ఏ బంగారానికో మారకం యిచ్చేసినట్లో..''

''అబ్బీ! అవేం కావురా!'' నా మాటల్ని మధ్యలోనే బావ తుంచేసేసరికి ''అంటే అమ్మలేదా! పోనీలే పాపం. కలల్లోనైనా వాడు మిగిలిపోయాడు'' తేలిగ్గా నిట్టూరుస్తూ అన్నాను. నాకు తెలుసుగా కొడుకు కట్నం కోసం బావ ఎన్ని కలలు కంటున్నాడో.

''లేదురా! అమ్మేసాను. కాకుంటే ఇదో వెరైటీ''

''అమ్మటంలో కూడా వెరైటీనా బావా?''

''అదేరా! భేషుగ్గా వేలం వేసి అమ్మేసాను. అబ్బ జనం ఏం పాడేర్రా వేలం. కోటి..కోటి వరకూ పోయిందిరా పాట'' మురిసిపోతూ చెబుతున్న బావను చూస్తూ. 'నీ డబ్బు పిచ్చి తగలెట్ట. కన్నకొడుకును వేలం వేసి అమ్మేశానని ఎంత మురిసిపోతూ చెబుతున్నావురా ముష్టిబావా!' అని మనసులో తిట్టుకున్నాను.

''ఏరా! ఎలా ఉంది కల?'' వీపుమీద చరుస్తూ అడిగాడు బావ. ఆనందంతో చరిచినా వీపు చుర్రుమంది. వారి చేయి విసురు అలాంటిది. ఏడ్వలేక నవ్వుతూ..''కలకేం బావా! బ్రహ్మాండం. నువ్వు కన్నాక అంతా లక్ష్మీ కలేగా! బాగుండక చస్తుందా?'' అన్నాను.

ఇంతలో ''హర హర మహాదేవా!'' అంటూ గంట వాయిస్తూ జంగం దేవర వచ్చాడు. వస్తూనే ''దండాలు మహాప్రభో! ధర్మాత్ములు. దానకర్ణులు. పండగ మామూళ్ళు యిప్పించండి మహాప్రభో!'' దండం పెడుతూనే దండకం చదివాడు.

''బావా! మామూళ్ళట'' కొంటెగా అన్నాను నేను.

నన్ను చూసి గుంభనంగా ఒక నవ్వు నవ్వి- ''ఏరా అబ్బీ! క్షేమమా'' అని జంగాన్ని ప్రేమగా పలకరించాడు బావ.

''ఏదో తమరి అనుగ్రహం మహాప్రభో!'' వారి పలకరింపునకు ఉప్పొంగిపోతూ అన్నాడు జంగం.

''ఏదీ ఓ పదం అందుకోరా! చాన్నాళ్ళయింది విని'' అన్నాడు బావ తాపీగా వాలు కుర్చీలో వెనక్కు వాలుతూ.

''హర హర మహాదేవా! నువ్వే లోకమందూ! ఆపై లోకమందూ! ఆ స్వర్గలోకమందూ! ఆ కైలాసమందూ!'' గంట వాయిస్తూ ఆనందంగా పాడసాగాడు జంగం.

నాకు ఒక పక్క మతిపోసాగింది. నా లెక్క ప్రకారం మామూళ్ళ మాట విన్న వెంటనే మా బావ పిచ్చికుక్కలా పైనబడి, అరచి, కరచి ఆ జంగాన్ని బయటకి గెంటాలి. అలాంటిది తీరిగ్గా పాట పాడించుకొని మరీ వింటున్నాడంటే ఇందులో ఏదో తిరకాసుంది అనుకుంటూ ఆశ్చర్యంగా చూడసాగాను. నాలాగే గోడ చాటున దాక్కుని చూస్తున్న నా మిత్రబృందానికీ అదో పజిల్ లానే ఉండి ఉంటుంది.

''ఏమిర్రా ఆ కూనిరాగాలు. కాస్త గొంతు విప్పు''

బావ గదమాయించేసరికి గొంతు పెంచాడు జంగం. రెండు క్షణాలు ఆలకించి ''ఏమిర్రా పాడుతున్నావా? ఊరికే పెదవులాడిస్తున్నావా? ఇవతల మనిషికి వినిపించి చావాలా? కొంచెం గట్టిగా పాడరా?'' చిరాకుగా అన్నాడు బావ.

''ఇంకా గట్టిగానా మహాప్రభో!'' అంటూ ఈసారి మరింత పెద్ద గొంతుతో పాడసాగాడు జంగం. ''అబ్బే చెవికి చేరందే. కొంచెం స్వరం పెంచరా!'' పెదవి విరుస్తూ అంటున్న బావ వంక ఆశ్చర్యంగా చూసాను.

'వాడి పాటకు ఓ పక్క మా చెవులు గింగుర్లెత్తిపోతుంటే వీరి చెవికి చేరలేదంటారేంటి? మా బావకు యింత చెముడెప్పుడొచ్చింది చెప్మా!'' అనుకున్నాను.

నా సందేహమే వాడికీ వచ్చినట్లుంది.

''ఇంత గొంతు చించుకొని అరుస్తున్నా మీ చెవికి చేరడం లేదా మహాప్రభో! యింకా స్వరం పెంచాలా!'' అని దీనంగా చూసి, తన శక్తినంతా కూడదీసుకొని యింటి పై కప్పు ఎగిరిపోయేటంత శృతిలో ''హర హర మహాదేవా! నువ్వేలోకమందూ! ఆపై లోకమందూ!'' అంటూ గొంతు చించుకున్నాడు జంగం.

''ఊ పెంచూ! యింకా'' అంటున్న బావ వంక పిచ్చాడిలా చూసి ''యింకా పెంచితే నేనే ఆ పై లోకానికి పోతాను మహాప్రభో!'' ఏడుపుగొంతుతో అన్నాడు జంగం.

''ఏంటో పిట్ట మనుషులూ! పిల్లి గొంతులూనూ. సరిగ్గా వినబడేట్టు పాడటమే రాదు. ఒరేయ్ అబ్బీ! పాట మాట అటుంచుగాని, అప్పటి నుండీ ఊరికే చేతులూపుతూ తెగ వాయించేస్తున్నావు. గంట శబ్దం వినిపించదేమిర్రా!'' అంటూ వాలు కుర్చీలోంచి మెల్లగా లేచి నిలబడ్డాడు బావ.

షాక్ కొట్టినట్లు నిర్ఘాంతపోయాం నేనూ, జంగమూనూ.

''ఆ! గంట శబ్దం కూడా వినిపించడం లేదా మహాప్రభో! అంటే మీది మామూలు చెముడు కాదు.. బ్రహ్మచెముడు'' అంటున్న జంగం చేతిలోని గంటను ఛటుక్కున లాక్కుని, నా వంక చూస్తూ..

''ఒరేయ్! ఈ వింత గంట చూసావా? ఎంత వాయించినా శబ్దం రాదు'' అంటూ వడిగా ముందుకు నడిచాడు బావ. ''మహాప్రభో! నా గంట'' అంటూ ఆయన వెనుక జంగం.

చావిట్లో నాలుగు మూలలకూ పరుగులు తీస్తూ గంట వాయిస్తూ ''చూసావా! శబ్దం వినిపించదంలా!'' అంటున్న బావ, వెనుక పరుగులు తీయలేక ''మహాప్రభో! మీ మామూళ్ళకో దండం! మీకో దండం. నా గంట నాకిప్పించారంటే మళ్ళీ జీవితంలో మీ ఎదుట పడితే నా గంట మీద ఒట్టు. మహాప్రభో! నా గంట'' అంటూ బావురుమన్నాడు జంగం. వాడిని విదల్చుకొని నా దగ్గరకు మళ్ళీ వచ్చి ''భలే గంట! పోనీ, పదో పరకో యిచ్చేసి మనమే ఉంచేసుకుందామేమిర్రా!'' అన్నాడు బావ.

''మహాప్రభో! ఆ పదీ నేనే ఎదురిచ్చుకుంటాను. నా గంట నాకు యిప్పించండి మహాప్రభో!'' అంటూ జేబులోంచి పది రూపాయల నోటు తీసి మా బావ చేతిలో పెట్టేసి, ఛటుక్కున తన గంటను లాక్కొని రివ్వున బయటకు పరుగెత్తాడు జంగం.

చేతిలోని పది రూపాయల నోటును మురిపెంగా చూస్తూ ముసి, ముసి నవ్వులు నవ్వుతున్న బావను చూసేసరికి నాకర్థం అయింది బావ చెముడు కథేమిటో.

ఇదంతా కళ్ళారా చూసిన నా మిత్రబృందం మా బావ దగ్గరకు చందా కోసం ఛస్తే రారని నాకు తెలుసు.

'జంగం నన్ను బ్రతికించాడు' అనుకుంటూ బయటకు వచ్చి చూసేసరికి చందా డబ్బాను గుండెలకు భద్రంగా పొదువుకొని పరుగుతీస్తున్న శేషు, 'హరి వెంకట్ సిరి' లా వాడి వెంట పరుగెడుతున్న మిత్రబృందం కన్పించారు. వాళ్ళు వెనక్కు తిరిగి చూస్తే ఒట్టు.

చిన్నగా నవ్వుకున్నాను.

'అవును మరి. వారి భయం వారిది. జంగం నుండి గంట లాక్కున్నట్టు ఏ దిక్కుమాలిన నాటకమో ఆడి మా చందా డబ్బాను మా బావ లాక్కుంటే మా గతి?'

